క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : వేమనరెడ్డి కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మార్పు చేస్తున్న ప్రక్రియలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సురక్ష ఎన్‌క్లేవ్, భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలో విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సత్య ఎన్‌క్లేవ్, రాజేంద్రరెడ్డి కాలనీ, కైలాష్‌నగర్, జవహర్ కాలనీ, ఓల్డ్ బాంబే రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కెఎస్ఆర్, ఓల్డ్ బాంబే ఫీడర్ల పరిధిలో కెఎస్ఆర్, అపర్ణ, పీజేఆర్ రోడ్డు నెం .2,4,8,9,12, జవహర్ కాలనీ, శంకర్‌నగర్, బీహెచ్ఈఎల్ మెయిన్ రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బీఆర్ఎస్ నేతల ఇంటింటి ప్రచారం

హఫీజ్‌పేట్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శేరిలింగంపల్లి అసెంబ్లీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఆరికెపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపిద్దామని అరికెపూడి శ్యామల దేవి పేర్కొన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్ కాలనీ, వివిధ బస్తీలు, కాలనీలలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి ఆమె బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికి తిరుగుతూ ప్రచారంలో వివరించారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

రాయదుర్గం: రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ను రంగారెడ్డిజిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిశారు. రాయదుర్గానికి చెందిన అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్యామ్లెట్ పాండు ఆధ్వర్యంలో రాయదుర్గం, మణికొండ, జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన రెజ్లింగ్ సభ్యులు, రెజ్లర్లు కలిసి ఆయనను సన్మానించారు. అనంతరం రెజ్లర్ల సమస్యలను వివరించి పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి



శేరిలింగంపల్లి: రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని మహిళను రైలు ఢీకొనడంతో మృతి చెందింది. ఈ సంఘటన లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ నాంపల్లి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని రెండవ ప్లాట్ ఫారం వద్ద మహిళ (40) పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందినది. జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల పీస్ మార్చ్



గచ్చిబౌలి: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గచిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల బృందం పీస్ మార్చ్‌ను నిర్వహించింది. నానక్‌రాంగూడలోని ప్రధాన రోడ్లపై పోలీసులు ఈ కవాతును నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయసంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల భద్రత ఉంటుందని అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలి పోలీసుల ఆధ్వర్యంలో ఈ కవాత్తును నిర్వహించారు.అదనపు డీసీపీ పర్యవేక్షణలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, అయిదు మంది ఏఆర్ సైబరాబాద్‌లు, సీఐఎస్ఎఫ్ ఫోర్స్ ఈ కవాత్తులో పనాల్గొన్నారు.



నిర్మించారు.. వదిలేశారు..

- రూ.3.90 కోట్లతో మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్
- రూ.50 లక్షలతో మోడల్ మార్కెట్ నిర్మాణం
- ఈ రెండూ వినియోగంలోకి వచ్చేది ఎన్నడో ?



నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ భవనం



స్పోర్ట్స్ కాంప్లెక్స్

రాయదుర్గం: ఆశయం గొప్పది, కానీ ఆచరణ మాత్రం ఉత్తదేనన్న చందంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించినా ఫలితం మాత్రం శూన్యంగా కనిపిస్తోంది. ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు అతి చేరువలోనే ఉన్న రెండు ప్రధాన నిర్మాణాలు ఎంతో ఉన్నత లక్ష్యంతో నిర్మాణం చేసినా ఆశించిన ఫలితం లేకుండా పోవడం విడ్డూరం. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో నిర్మించిన జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియం, టీఎన్‌జీఓకాలనీలో నిర్మించిన మోడల్ మార్కెట్ నిరుపయోగంగా మారాయి. వీటిని అందుబాటులోకి తేకపోవడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తు న్నారు.

- 2012 జూలై 21న రూ. 6 కోట్లతో ఖాజాగూడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే నిధుల విడుదలలో జాప్యంతో ఆరున్నరేళ్ళ క్రితం ఇండోర్‌స్టేడియం మాత్రమే నిర్మాణం చేశారు. ఈ స్పోర్ట్ కాంప్లెక్స్‌లో నాలుగు బ్యాడ్మింటన్ కోర్టులు, క్యారమ్స్, చెస్, మినీ జిమ్, కోచ్‌లు, యోగా గది,పరిపాలనాధికారి కార్యాలయం, రెస్ట్ రూమ్, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటి వరకు రూ.3.90 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణం రెండేళ్ళ క్రితమే పూర్తి చేశారు. అప్పటి నుంచీ ఇప్పటి వరకు తాళం వేసి ఉంచారు. కానీ వ్యాక్సినేషన్ కోసం వినియోగించారు.

రూ.50 లక్షల ఖర్చుతో మోడల్ మార్కెట్.. అయినా ప్రయోజనం శూన్యం

- మోడల్ మార్కెట్ల నిర్మాణానికి ఆరేళ్ళ క్రితం గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీఓ కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించారు. ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి స్థాయిలో చేయని స్థలంలో ఏర్పాటు చేయడం తో వ్యాపారాలు నిర్మించిన దుకాణాలు తీసుకొనేందుకు వ్యాపారులు వెనుకడుగు వేయడంతో దీన్ని నిర్మించినా మూసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.

గృహహింస చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని తదితరులు

హఫీజ్‌పేట్ : మహిళలకు గృహహింస చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అంతే కాకుండా మహిళలు స్వశక్తితో ఎదగాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని వసంత సిటి క్లబ్ హౌజ్‌లో కోవె తెలంగాణ ఛాంబర్స్ ఆధ్వర్యంలో కోవె హట్ పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు దేశ వ్యాప్తంగా 50 శాతం సొంతంగా వ్యాపార రంగాలలో రాణిస్తున్నారని 10 శాతం మహిళలు మాత్రం గృహిణిలుగా ఉంటు వారి పిల్లలను చూసుకుంటున్నారన్నారు. నేటి సమాజంలో పురుషులతో పాటు మహిళలు సమానంగా పోటీ పడుతున్నారన్నారు. పురుషులతో పోలిస్తే మహిళల కోసం అనేక చట్టాలను రాజ్యాంగం తీసుకువచ్చిందన్నారు. అనంతరం క్లబ్ హౌజ్‌లో మహిళలు తయారు చేసి ఉత్పత్తులను స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వాటిని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ అధ్యక్షురాలు చేతన్ జైన్, వైస్ ప్రెసిడెంట్ కల్పనరావు, సెక్రటరీ నీరజ గొడవర్తి, ట్రెజరర్ నిషా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కళాకృతి నృత్యాలయ గురువు భారతి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఇందులో పుష్పాంజలి, ఆనందనర్తన గణపతిం, మామవతు, కట్టిదుర వైకుంఠం, దుర్గే దుర్గే, చిన్నిశిశువు, దేవర్ణమా, డోలాయం తదితర అంశాలను కళాకారులు విష్ణుప్రియ, తనిష్క, అధ్రితి, శ్రీనయన, సహస్ర, సంజనలు పాల్గొని ప్రదర్శించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పోలీస్ డిపార్ట్‌మెంట్ 8వ బెటాలియన్ పోలీస్ బ్యాండ్‌ను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.


చందానగర్‌లో గురు సన్మానోత్సవం



గురుస్వామి మురళినంబూద్రిని సన్మానిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్‌లో అయ్యప్పగురుస్వామికి గురు సన్మానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సోమాజిగూడ అయ్యప్ప స్వామి ఆలయ అర్చక స్వామి మురళినంబూద్రిని అయ్యప్పస్వాములు ఘనంగా సత్కరించారు. ఎన్నో ఏళ్ళుగా అకుంఠిత దీక్షతో సేవలను చేస్తున్న అయనను గుర్తించి ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు శబరిమల సన్నిధానంలోని మాలిక పురత్తు అమ్మవారి సన్నిధానం మేల్ శాంతి(ప్రధాన అర్చకులు) నియమించిన నేపథ్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుస్వామి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దీప్తిశ్రీనగర్‌లోని పీజేఆర్ఎన్‌క్లేవ్ రోడ్డులోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్పభక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో..





గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..

రాయదుర్గం: చంద్రగ్రహణం అనంతరం ఆదివారం ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో శనివారం సాయంత్రం ఆలయాల్లో పూజల అనంతరం మూసి వేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం ఆలయాలను తెరిచి ప్రాంగణంలో ప్రత్యేకంగా సంప్రోక్షణ కార్యక్రమాన్ని అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో సాగింది. అనంతరం అమ్మవార్లకు, దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు.

మార్గం సుగమం



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై గుంతను పూడ్చివేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బాక్స్ టైప్ డ్రైన్ పనుల కోసం రోడ్డుపై తవ్వి వదిలేసిన ప్రాంతంలో ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు మట్టి పోసి రాకపోకలకు మార్గం సుగమం చేశారు. 'సాక్షి'లో ఆదివారం ' ఆర్‌టీబీతోనే అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కారం' అనే శీర్షిక ప్రచురితమైంది. దీనికి ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుపై అడ్డంగా ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తొలగించడంతో పాటు రోడ్డుపై తవ్విన గుంతను పూడ్చి వేశారు. దీంతో వాహనదారులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

చేసిన మంచిని చెప్పండి

- మంత్రి హరీశ్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేగా మరోసారి మహిపాల్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ నుంచి నర్సాపూర్‌కు ఆయన వెళుతూ గుమ్మడిదలలో ఉన్న టోల్‌గేట్ వద్ద నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో ఉండి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పటాన్‌చెరు నియోజకవ ర్గంలో మరోసారి ఎమ్మెల్యేగా మహిపాల్‌రెడ్డిని గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, గోవర్దన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విరాళం అందజేత



విరాళాన్ని అందిస్తున్న వర్తక సంఘం నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో నూతనంగా నిర్మించనున్న శివాలయ నిర్మాణానికి విరాళాలు అందించేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు. వర్తక సంఘం నాయకులు ఆదివారం రూ.20 వేల విరాళం నిర్వాహకులకు అందజేశారు. దేవాలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు.

నగదు, మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులు నగదు పట్టుకున్నారు. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల నిబంధనల్లో భాగంగా బీడీఎల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.లక్షను కనుగొన్నారు. ఈ నగదుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అందజేశారు. అదేవిధంగా పటాన్‌చెరు మండలం నంది గామలో మహేష్ కిరణా షాపులో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నానని విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి రూ.8 వేలు విలువచేసే మద్యం సీజ్ చేశారు.

ముచ్చటగా మూడోసారి విజయం మనదే



సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

రాయదుర్గం: ముచ్చటగా మూడోసారి శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ధీమా వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నరేళ్ళలో మంచిపనులు ఎన్నో చేశామని, మళ్ళీ ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి మహానగరంలోనే ఆదర్శంగా మారుస్తా మని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నానక్‌రాంగూడ, గోపన్‌పల్లిలోని అవంతిక హోమ్స్, లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీల్లో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి పాల్గొని వారితో ముచ్చటించి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని, మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, చెన్నంరాజు, సత్యనారాయణ, దాసరిగోపి, ప్రసాద్‌చ మల్లేష్, నాగభూషణం, కాలనీ వాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగుర వేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిలిపారు. శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏ కాలనీకి వెళ్ళినా బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భారీగా పార్టీలో చేరుతున్నారని వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు డి.వీరేశం గౌడ్, రాజేశ్వరమ్మ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, కార్యకర్తలు, నాయకులే నా బలం

శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రజలు, కార్యకర్తలు, నాయకులే తన బలమని, తనను నమ్ముకున్న కార్యకర్తలను వమ్ము చేయనని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మియాపూర్ సితార హోటల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కర్షక కమిటీ చైర్మన్ అవినాష్ రెడ్డి, కోఆర్డినేటర్లు కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డిలతో పాటు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఎలాంటి గ్రూపులు, కులాలు, మతం లేదని, ఎవరు ఎలాంటి సమస్యతో వచ్చినా పరిష్కరించడం తన మనస్తత్వమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు కలిసి సైనికుల్లాగ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్పొరేటర్లు మహిపాల్ యాదవ్, భరత్ గౌడ్, రేణుక, సురేష్ నాయక్, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టికెట్ రవి యాదవ్‌దే.... గెలుపు అతనిదే



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

- శేరిలింగంపల్లి టికెట్ బీజేపీ వదులుకోదు
- జనసేన పార్టీకి ఒక్క కార్యకర్త కూడా లేడు
- బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి
- మసీద్‌బండలో ముఖ్య కార్యకర్తల సమావేశం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి టికెట్ రవి కుమార్ యాదవ్ దే... గెలుపు కూడా రవి కుమార్‌దేనని బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మసీద్‌బండలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ ఆధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా శేరిలింగంపల్లి టికెట్‌ను జనసేన అడుగుతున్న మాట నిజమేనని, చేవెళ్ల పార్లమెంట్‌లో శేరిలింగంపల్లి అత్యంత కీలకంగా ఉందన్నారు. ఢిల్లీ పీఠం కోసం ఎంపీ సీటు కూడా ముఖ్యమని పార్టీ పెద్దలకు తెలుసన్నారు. శేరిలింగంపల్లి టికెట్ రవి యాదవ్‌కే వస్తుందని, గెలుపు కూడా ఆయనదేనని అన్నారు. పొత్తు అంటున్న పార్టీకి మసీద్‌బండలో ఒక్క కార్యకర్త కుడా లేడని, అభిమానులు ఉన్నా మాకే ఓటు వేస్తారని ఆయన అన్నారు. గెలుపుపై అనుమానాలు ఉండటంతోనే సీఎం కేసీఆర్ ఉత్తర తెలంగాణలోనే రెండు చోట్ల పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైన్‌ను లోపం కేసీఆర్ పాపమే అన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ..జనసేనకు ఇచ్చే అవకాశం లేదని, నాయకులంతా యదావిధిగా పని చేసుకోవాలని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి పాల్గొన్నారు.

అకౌంట్స్ వివరాలు తెలపాలి


- నామినేషన్‌కు 48 గంటల ముందే బ్యాంక్ ఖాతా
- నామినేషన్‌కు వేసే అభ్యర్థితోపాటు నలుగురికి అనుమతి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: రానున్న ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి తన ఖాతా వివరాలను ఎప్పటికప్పుడు అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ ఆఫీసర్‌కు అందజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కి 48 గంటల ముందే అభ్యర్థి జాతీయ బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేయాలన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అయ్యే ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల్లో రూ.10 వేలు మాత్రమే నగదు రూపంలో, మిగతా రూ.39 లక్షల 90 వేలు ఆన్‌లైన్‌లో ఖర్చు చేయాలని చెప్పారు. గుర్తింపు పొందిన పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తే ఒకరి ప్రపోజల్ సరిపోతుందని, అదే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తే పదిమంది ప్రపోజల్స్ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్, మాస్టర్ ట్రైనర్ అమరేందర్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం



మల్లికార్జున్ ఖర్గేను సన్మానిస్తున్న కాటా శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి విజయభేరి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు ఆదివారం పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.